# లక్ష కోట్ల డివిడెండ్?




## ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రానికి ఆర్బీఐ చెల్లించవచ్చన్న అంచనాలు

## మోదీ హయాంలోనే దాదాపు రూ.7 లక్షల కోట్లు రాక

## ఖజానాకు పెద్ద ఎత్తున తరలిపోతున్న రిజర్వ్ బ్యాంక్ మిగులు నిల్వలు

న్యూఢిల్లీ, మే 10: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను కేంద్ర ప్రభుత్వానికి దాదాపు లక్ష కోట్ల రూపాయల డివిడెండ్‌ను చెల్లించవచ్చని తెలుస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కోసం ఈ ఏడాది ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో మోదీ సర్కారు ప్రకటించిన బడ్జెట్‌లో ఆర్బీఐతోపాటు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రూ.1.02 లక్షల కోట్ల డివిడెండ్ రావచ్చని అంచనా వేశారు. గత ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను తెచ్చిన బడ్జెట్‌కు సంబంధించి తర్వాతి కాలంలో చేసిన సవరణల్లో ఇది రూ.1.05 లక్షల కోట్లుగా ఉన్నది. నిజానికి తొలుత రూ.48,000 కోట్లుగానే అంచనా వేశారు. అయితే అంతకుముందు ఆర్థిక సంవత్సరానికి (2022-23)గాను ఆర్బీఐ రూ.87,416 కోట్ల డివిడెండ్‌ను చెల్లించింది. దీంతో బడ్జెట్ అంచనాలు పెరిగాయి. ఇక ఈసారి అంచనాలో సుమారు లక్ష కోట్లు ఆర్బీఐ నుంచే డివిడెండ్‌గా వెళ్లవచ్చన్నదే ఇక్కడ ప్రాధాన్యతాంశం. మరోవైపు ఈ డివిడెండ్‌ను చెల్లించేందుకు ఆర్బీఐ సైతం తగువిధంగా సిద్ధమవుతున్నట్టు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక ద్వారా తెలుస్తున్నది.

### మోదీ హయాంలో కేంద్రానికి ఆర్బీఐ డివిడెండ్లు (రూ.కోట్లలో)




### విదేశీ కరెన్సీ ఆస్తులే కీలకం

కేంద్ర ప్రభుత్వానికి ఏటేటా ఆర్బీఐ అంతంత మొత్తాల్లో డివిడెండ్లు చెల్లించడం వెనుక.. ఆర్బీఐ రిజర్వుల్లో ఉన్న విదేశీ కరెన్సీ ఆస్తులే కీలకంగా నిలుస్తున్నాయి. వడ్డీ ఆదాయం కూడా ప్రధాన భూమికే పోషిస్తున్నది. ఆర్బీఐ రిజర్వుల్లో 70 శాతం విదేశీ కరెన్సీ ఆస్తులే. 20 శాతం దేశీయ ప్రభుత్వ బాండ్లున్నాయి. వీటితోపాటు ఆర్బీఐ నిర్వహించే వివిధ ద్రవ్య కార్యకలాపాలతో వచ్చే ఆదాయం పెద్ద మొత్తంలో ఉంటున్నది. అయితే ఫారెక్స్ మార్కెట్‌లో ఒడిదొడుకులు.. ఆర్బీఐకి షాక్ ఇస్తున్నాయి. మొత్తానికి అధిక ద్రవ్యోల్బణం, వర్షాభావ పరిస్థితులు, అంతర్జాతీయ ప్రతికూల పరిణామాలు సవాల్ విసురుతున్న ప్రస్తుత తరుణంలో ఆర్బీఐ దగ్గర తగినన్ని నగదు నిల్వలుండాల్సిన అవసరం ఉందని ఆర్థిక విశ్లేషకుల మాట.

### అతితో అనర్థాలే

దేశ ఆర్థిక, ద్రవ్య వ్యవస్థలకు ఆర్బీఐనే వెన్నెముక. అలాంటి ఆర్బీఐని కూడా ప్రభుత్వ రంగ సంస్థల్లో ఒకటిగా మోదీ సర్కారు చూడటం కలవరపెడుతున్నది. అందుకు ఈ అధిక డివిడెండ్ చెల్లింపులే నిదర్శనం. మోదీ హయాంలో ఆర్బీఐ చెల్లించిన డివిడెండ్లు రూ.6,62,455 కోట్లుగా ఉన్నాయి. 2023-24 డివిడెండ్‌నూ కలిపితే రూ.7 లక్షల కోట్లపైనే. నిజానికి ఆర్బీఐ దగ్గరున్న మిగులు నిల్వలపై ఎప్పట్నుంచో కన్నేసిన బీజేపీ ప్రభుత్వం.. వాటిని ఎలాగైనా సొంతం చేసుకోవాలనే చూస్తూ వస్తున్నది. ఈ క్రమంలోనే అప్పటి ఆర్బీఐ గవర్నర్ రఘురామ్ రాజన్‌తో, ఆ తర్వాత వచ్చిన ఉర్జిత్ పటేల్‌తో కేంద్రానికి గొడవలు మొదలయ్యాయి. ఇక ఉర్జిత్ పటేల్ రాజీనామా వ్యవహారం పెద్ద దుమారాన్నే రేపింది. అలాగే ఆర్బీఐ వ్యవహారాల్లో కేంద్ర జోక్యంపైనా విమర్శలు చెలరేగిన సంగతి విదితమే. కాగా, ఆర్బీఐ దగ్గర ఎన్ని నగదు నిల్వలుంటే అంత మంచిదని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. ఆపత్కాలంలో, సంక్షోభ సమయంలో ఈ నగదు నిల్వలు దేశ ఆర్థిక వ్యవస్థకు కొండంత అండగా ఉంటాయని పేర్కొంటున్నారు. కానీ కేంద్రం ముక్కుపిండి వసూలు చేస్తున్న డివిడెండ్లు.. ప్రమాదం తెచ్చిపెట్టవచ్చని హెచ్చరిస్తున్నారు. రికార్డు స్థాయిలో తీసుకుంటున్న డివిడెండ్లు సరికాదన్న అభిప్రాయాన్ని వారు వెలిబుచ్చుతున్నారు.

# ఆస్కీతో టీ-హబ్ జట్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 10 (నమస్తే తెలంగాణ): అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ-ఆస్కీ)తో టీ-హబ్ జత కట్టింది. ఈ క్రమంలోనే వ్యాపార కార్యకలాపాలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన నైపుణ్యాలను స్టార్టప్ వ్యవస్థాపకులకు భోదించేందుకు 'ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మేనేజ్‌మెంట్' పేరుతో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఆసక్తిగలవారు టీ-హబ్‌ను సంప్రదించాలని టీ-హబ్ సీఈవో రావు కోరారు.

### టీ-హబ్‌లో టీ బ్రిడ్జ్

నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడమే లక్ష్యంగా టీ బ్రిడ్జ్ పేరుతో టీ-హబ్ ఓ సరికొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆసక్తిగలవారు (https://bit.ly/3OFAu2o) లింకు ద్వారా సంప్రదించవచ్చు.

## దశాబ్దకాలం గరిష్ఠానికి ఎల్‌ఐసీ ప్రీమియం వసూళ్లు

న్యూఢిల్లీ, మే 10: ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసీ) ఏప్రిల్ ప్రీమియం వసూళ్లు దశాబ్దం గరిష్ఠాన్ని తాకాయి. రూ.12,383.64 కోట్లుగా నమోదయ్యాయి. 2014 నుంచి చూస్తే ఒక నెలలో ఇదే అత్యధికం. గత ఏడాది ఏప్రిల్‌లో రూ.5,810.10 కోట్లే. దీంతో 113.14 శాతం వృద్ధి కనిపించింది. కాగా, వ్యక్తిగత ప్రీమియంల కంటే గ్రూప్ ప్రీమియంల వాటనే ఎక్కువ.

## రూ.888కే నెట్‌ఫ్లిక్స్‌తో జియో బేసిక్ ప్లాన్

న్యూఢిల్లీ, మే 10: నెలకు రూ.888కే నెట్‌ఫ్లిక్స్ తదితర 15 యాప్స్ బేసిక్ సబ్‌స్క్రిప్షన్ కలిగిన ఓ బ్రాడ్‌బాండ్ ప్లాన్‌ను తీసుకొచ్చినట్టు రిలయన్స్ జియో శుక్రవారం తెలిపింది. 30 ఎంబీపీఎస్ ఇంటర్నెట్ స్పీడ్ ఉన్న ఈ ప్లాన్‌లో అమెజాన్ ప్రైమ్ లైట్, డిస్నీప్లస్ హాట్‌స్టార్ ఇతరత్రా యాప్స్ ఉన్నాయని చెప్పింది. గతంలో రూ.1,499 ప్లాన్‌లో మాత్రమే నెట్‌ఫ్లిక్స్ ఉన్న విషయం తెలిసిందే.

# బీవోబీ లాభం రూ.4,886 కోట్లు

- క్యూ4లో స్వల్ప వృద్ధి

న్యూఢిల్లీ, మే 10: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) గత ఆర్థిక సంవత్సరం (2023-24) క్యూ4 లేదా చివరి త్రైమాసికం (జనవరి-మార్చి)లో రూ.4,886 కోట్ల నికర లాభాన్ని అందుకున్నది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23) ఇదే త్రైమాసికంలో రూ.4,775 కోట్ల నికర లాభాన్ని పొందింది. ఆదాయం ఈసారి రూ.33,775 కోట్లుగా నమోదైంది. పోయినసారి రూ.29,323 కోట్లుగా ఉన్నట్టు శుక్రవారం బ్యాంక్ తెలియజేసింది. ఇక స్థూల నిరర్థక ఆస్తులు 2.92 శాతానికి, నికర నిరర్థక ఆస్తులు 0.68 శాతానికి తగ్గాయి. కాగా, 2023-24కుగాను రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేర్‌కు రూ.7.60 డివిడెండ్‌ను బీవోబీ బోర్డు సిఫార్సు చేసింది.

## ఆర్బీఐ ఈడీగా ఆర్‌ఎల్ రావు

ముంబై, మే 10: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) శుక్రవారం తమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా ఆర్ లక్ష్మీకాంత రావును నియమించింది. అంతకుముందు ఈయన రెగ్యులేషన్ శాఖ ఇంఛార్జ్ సీజీఎంగా పనిచేశారు. కాగా, ఈడీగా డిపాజిట్ ఇన్సూరెన్స్, క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్, సమాచార శాఖ, తదితర విభాగాలను చూసుకోనున్నారు.

## టీవీఎస్ చేతికి హోమ్ క్రెడిట్

న్యూఢిల్లీ, మే 10: హోమ్ క్రెడిట్ ఇండియా ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 80.74 శాతం వాటాను దక్కించుకోబోతున్నట్టు టీవీఎస్ హోల్డింగ్స్ లిమిటెడ్ శుక్రవారం తెలిపింది. మిగతా 19.26 శాతం వాటాను ప్రేమ్‌జీ ఇన్వెస్ట్, మరి కొందరు పొందుతారు. మొత్తం డీల్ విలువ రూ.686 కోట్లుగా ఉన్నది.

# కల్యాణ్ జువెల్లర్స్ దూకుడు

- క్యూ4లో రూ.137 కోట్ల లాభం




ముంబై, మే 10: ప్రముఖ నగల వ్యాపార సంస్థ కల్యాణ్ జువెల్లర్స్ గత ఆర్థిక సంవత్సరం (2023-24) క్యూ4 లేదా ఆఖరి త్రైమాసికానికి (జనవరి-మార్చి)గాను పన్ను అనంతరం రూ.137.49 కోట్ల ఏకీకృత లాభం ప్రకటించింది. ఏడాది క్రిందటితో పోల్చితే 97 శాతం పెరిగినట్టు శుక్రవారం తెలియజేసింది. నాడు రూ.69.79 కోట్లుగానే ఉన్నది. ఆదాయం కూడా 34 శాతం వృద్ధితో రూ.4,534.93 కోట్లకు చేరింది. పోయినసారి రూ.3,381.80 కోట్లే. ఇదిలావుంటే ఈ ఏడాది మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను ఒక్కో ఈక్విటీ షేర్‌కు రూ.1.2 తుది డివిడెండ్‌ను సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు సిఫార్సు చేశారు. ఇది భాగస్వాముల అనుమతికి లోబడి ఉంటుంది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ)లో శుక్రవారం సంస్థ షేర్ విలువ 3.37 శాతం ఎగిసి రూ.410.85 వద్ద ముగిసింది. 'గత ఆర్థిక సంవత్సరం మా వ్యాపారం బాగానే సాగింది. బంగారం ధరల్లో ఒడిదొడుకులున్నా ఈ ఆర్థిక సంవత్సరం కూడా ఉత్సాహంతో ముందుకెళ్తున్నాం. ముఖ్యంగా ఈ పెండ్లిళ్ల సీజన్‌లో కస్టమర్ల నుంచి విశేష స్పందన లభించింది. అక్షయ తృతీయ జోష్ కనిపిస్తున్నది' అని కల్యాణ్ జువెల్లర్స్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేశ్ కల్యాణరామన్ అన్నారు.

# అక్షయ తృతీయ అదుర్స్



- జోరుగా బంగారం అమ్మకాలు
- ప్రభావం చూపని అధిక ధరలు

ముంబై, మే 10: బంగారం ధరలు రికార్డు స్థాయిల్లో పలుకుతున్నా.. అక్షయ తృతీయ అమ్మకాలు మాత్రం ప్రభావితం కాలేదు. గత ఏడాదితో పోల్చితే గోల్డ్ రేటు 15-17 శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ.. శుక్రవారం కొనుగోళ్లు బాగానే జరిగాయని దేశీయ రిటైల్ నగల వ్యాపారులు తెలిపారు. దేశవ్యాప్తంగా ఈసారి అక్షయ తృతీయకు గోల్డ్ సేల్స్ ఆకర్షణీయంగా ఉన్నాయని, ముఖ్యంగా తెలంగాణ తదితర దక్షిణాది రాష్ట్రాల్లో పుత్తడి విక్రయాలు పెద్ద ఎత్తున నమోదైనట్టు అఖిల భారత రత్నాలు, ఆభరణాల మండలి చైర్మన్ సైయం మెహ్రా పీటీఐకి తెలిపారు. ఈసారి తులం పసిడి రూ.71,000 పలుకగా, గత ఏడాది ఇదే సమయంలో రూ.60,000గానే ఉన్నది. కాగా, గురువారం నుంచి చూస్తే బంగారం ధర 10 గ్రాములు రూ.800 పెరిగిందని, ఇది అమ్మకాలను 5-7 శాతం దెబ్బ తీసిందన్న అభిప్రాయాన్ని మెహ్రా వ్యక్తం చేశారు. అయినప్పటికీ ఓవరాల్‌గా ఈసారి సేల్స్ అంచనాలకు మించే జరిగాయని మెజారిటీ వ్యాపారులు చెప్తుండటం విశేషం. ఇక వెడ్డింగ్ జువెల్లరీ వంటి హెవీ వెయిట్ ఐటమ్స్‌కు దక్షిణాది మార్కెట్‌లో డిమాండ్ కనిపించినట్టు మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. ఇది పెండ్లిళ్ల సీజన్ కానప్పటికీ పెరుగుతున్న ధరల దృష్ట్యా ఎక్కువ కుటుంబాలు భారీ డిజైన్ నగల కొనుగోళ్లకే ప్రాధాన్యత ఇచ్చాయని మెహ్రా వివరించారు. అయితే ఉత్తరాది, మిగతా రాష్ట్రాల్లో తేలికపాటి ఆభరణాలకే ఆదరణ ఉన్నదన్నారు. ఈసారి అమ్మకాలపై ధరల ప్రభావం లేదని పీఎన్‌జీ జువెల్లర్స్ సీఎండీ సౌరభ్ అన్నారు. శనివారం మధ్యాహ్నం వరకూ అక్షయ తృతీయ సేల్స్ జరుగనున్నాయి.

### ఒక్కరోజే రూ.950 పైకి

ఢిల్లీలో ఈ ఒక్కరోజే 24 క్యారెట్ 10 గ్రాముల ధర రూ.950 ఎగిసింది. స్పాట్ మార్కెట్‌లో రూ.73వేల మార్కుకు ఎగువన రూ.73,200గా నమోదైంది. కిలో వెండి ధర కూడా రూ.2,300 ఎగబాకి రూ.85,500 పలికింది. హైదరాబాద్‌లోనూ తులం 24 క్యారెట్ రేటు రూ.930 పుంజుకొని రూ.73,090గా ఉన్నది. 22 క్యారెట్ రూ.850 అందుకుని రూ.67,000గా ఉన్నది. కిలో వెండి ధర రూ.2,500 పెరిగి రూ.87,700ను తాకింది. ఇదిలా ఉంటే గత ఆర్థిక సంవత్సరం దేశంలోకి 45.54 బిలియన్ డాలర్ల విలువైన బంగారం దిగుమతులు జరిగాయి. గతంతో పోలిస్తే 30% పెరిగాయి.